# తండ్రి మనసు

సాయంకాలం అయిదుగంటల సమయం. భాద్రపద మాసం వచ్చినా శ్రావణ మేఘాలు కనబడుతూనే వున్నాయి. కొద్దిగా మబ్బుపట్టి వర్షం వచ్చేలా వుంది వాతావరణం.

అయిదోసారి వీధి గుమ్మంలోకి వచ్చి బయటకు తొంగిచూసి లోపలికి వెళ్ళింది ఇందీవరాక్షి.

ముందు గదిలో కూర్చుని పేపర్ని మళ్ళీ ఒకమారు తిరగేస్తున్న హరిహరరావు పెదవులమీద చిరునవ్వు తొంగి చూసింది.

కొడుకు విశ్వామిత్ర ఆరుగంటలకిగానీ ఇంటికి చేరడు. అయిదుగంటలకే ఆఫీసుపని అయిపోయినా వెంకటరమణ కాలనీలో వున్న కార్యాలయం నుండి మాధవీనగర్‌లో వున్న ఇంటికి చేరడానికి అరగంటపైనే పడుతుంది.

ఇందీవరాక్షి విశ్వామిత్ర భార్య. వాళ్ళిద్దరికీ పెళ్ళి రెండు నెలలే అయింది.

రోజూ అయిదూ యాభై నిముషాల నుండి గేటు దగ్గర నిలబడి ఎదురు చూస్తుంటుంది. ఈరోజు ఐదు గంటలకే అయిదుసార్లు వచ్చి తొంగిచూసి వెళ్ళిందంటే త్వరగా వస్తానని చెప్పాడేమో అనుకున్నారాయన.

'ఏ సినిమా ప్రోగ్రామో వేసుకుని వుంటారు' అనుకుని పేపరు మీదికి దృష్టి మరల్చాడాయన.

ఆ గదిలోనే ఒక పక్కగా కూర్చుని చంటిబిడ్డకు నూనె రాస్తున్నది ఆయన భార్య అంజని.

చీరెను మోకాళ్ళమీది దాకా పైకి లాగి రెండునెలల మనవరాలిని కాళ్ళమీద పడుకోబెట్టుకుని నూనె మర్దనా చేస్తున్నది అంజని.

నలుగురు తిరిగేచోట ఆవిడ అలా కూర్చోవడం ఆయనకు నచ్చలేదు. గానీ ఆయన అభిప్రాయాల గురించి అంజని పట్టించుకోవడం మానేసి కొంతకాల మయింది.

విశ్వామిత్ర పెళ్ళికి నెల్లాళ్ళుండగా అంజని తమ రెండో కూతరు కామాక్షిని పురిటికని పుట్టింటికి తీసుకువచ్చింది.

కామాక్షి భర్త ఈ ఊళ్ళోనే ఉద్యోగం చేస్తుండబట్టి తొమ్మిదోనెల దాక భార్యను పుట్టింటికి పంపలేదు. భర్తకు భోజనానికి ఇబ్బంది అవుతుందని కామాక్షే రానన్నది. అందుకని అంజని రోజూ కూతురింటికి వెళ్ళి వండి పెట్టి వచ్చేది. వాళ్ళ ఇల్లు దగ్గరే కావడం వలన ఇబ్బందిలేక పోయింది. కానీ తమ్ముడి పెళ్ళి కుదిరాక తల్లికి అటూ తిరగడం కష్టమని పుట్టింటికి వచ్చేసింది కామాక్షి. పెళ్ళినాటికి ఆమె పదిహేనురోజుల బాలింత.

స్కూటరు వచ్చి ఇంటిముందు ఆగిన చప్పుడు విన బడింది. చేతిలో పువ్వుల పొట్లం పట్టుకుని హుషారుగా లోపలికి అడుగుపెట్టాడు విశ్వామిత్ర.

కొడుకుని చూడగానే అంజని ముఖం వికసించింది. ''సమయానికి వచ్చావురా... మీనాక్షి ప్యాపిలి నుండి రెండున్నర బస్సుకి బయల్దేరిందట. బస్సు వచ్చే టైమవుతూంది... బిర్లా గేటు దాకా వెళ్ళి ఆటో ఎక్కించి తీసుకురా. మీ నాన్నని వెళ్ళమందామని అనుకునేంతలో నువ్వే వచ్చావు'' అన్నదామె.

వంటింట్లో నుండి ముందుగదిలోకి ఛెంగున వచ్చిన ఇందీవరాక్షి ముఖం అత్తగారి మాటలతో చిన్నబోయింది.

డా॥ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

అంతలో గదిలో నుండి బయటకు వచ్చిన కామాక్షి ''అమ్మ అసలు విషయం చెప్పనేలేదు కదూ నీకు... పాపకి నామకరణం చేయడానికి ఈ ఆదివారం దివ్యంగా వున్న దని చెప్పార్ట పంతులు గారు.అమ్మ మీనాక్షి అక్కకు ఫోన్ చేసి విషయం చెప్పగానే పాపం అక్క వెంటనే బయల్దే రింది. రెండు మూడు రోజుల ముందు వస్తేగానీ పనులు కావుగదా! మా అత్తయ్యా, మావయ్యా శనివారం నాడు వస్తార్ట. పెట్టుడుబట్టలు అవీ కొనాలి కదా!'' అన్నది.

విశ్వామిత్ర పువ్వుల పొట్లం బల్లమీద పెట్టేసి ఉసూరు మంటూ వెనక్కి మళ్ళి స్కూటరు స్టార్ట్ చేశాడు. అతని ముఖంలో ఆశాభంగం స్పష్టంగా కనబడింది.

హరిహరరావు కుర్చీలో నుండి లేచి ''బిర్లాగేటు దగ్గరంటే అర్ధమైలు దూరం లేదు. మీనాక్షికి ఈ ఊరు కొత్తనా ఏమిటి? అంతగా అయితే నేను వెళ్ళి తీసుకు వస్తాలే... వాడు గంట ముందుగా ఇంటికి వచ్చాడంటే భార్యాభర్తలిద్దరూ ఎక్కడికన్నా వెళ్ళాలనుకుంటున్నా రేమో'' అన్నాడు చెప్పులు తొడుక్కుంటూ.

''ఒకవేళ అనుకున్నా ఇప్పుడు ఎలా వెళ్తారు? వదిన గారు ఇంటికి వస్తుంటే మొగుడితో షికారుకి వెళ్ళి పోతుందా ఇందీవరాక్షి? ఏం మాట్లాడుతారు? మీనాక్షి

వస్తున్నట్టు ఫోను చేసినపుడు ఇందు పడుకున్నట్టు వుంది. అందుకే నేను చెప్పలేదు. నువ్వెళ్ళరా... మళ్ళీ బస్సు వచ్చేస్తే బావుండదు'' అత్తగారి అధికారం చూపుతూ అన్నది అంజని.

విశ్వామిత్ర స్కూటరుమీద వెళ్ళిపోయాడు. హరి హరరావు మళ్ళీ తన చోట్లో కూర్చున్నాడు.

ఇందీవరాక్షి లోపలికి వెళ్ళడానికి వెనక్కి తిరిగింది. ''అమ్మాయ్. కాఫీ డికాక్షను వేసి, చపాతీల పిండి కలుపు. పిల్లలు ట్యూషను నుండి వచ్చేవేళ అయింది'' అన్నది అంజని కోడలిని ఉద్దేశించి.

బయట వరండాలో కట్టమీద పడుకుని వున్న హరి హరరావు తల్లి దగ్గుతూ లేచి కూర్చుంది. ''నా ముఖాన ఇన్ని కాఫీ నీళ్ళు పోస్తారా లేదా? ఈ ఇంట్లో పెద్ద వాళ్ళకు పలికే దిక్కులేదు...'' అన్నదామె నిష్ఠూరంగా.

హరిహరరావు కుర్చీలో నుండి లేచి తల్లిదగ్గరకు వెళ్ళాడు... ''కాఫీ కలుపుతున్నారే... ఇస్తారు. ఒక క్షణం ఓపికపట్టు'' అన్నాడు.

''అవున్రా... నీ పెళ్ళాన్ని వెనకేసుకుని రావడం నీకలవాటేగా...!'' అని దీర్ఘం తీసింది.

హరిహరరావుకు ఆవిడతో వాదించి లాభంలేదని తెలుసు గనుక ఊరుకున్నాడు. మొదటి నుండీ అంతే ఆవిడ. అంజని అత్తింటికి వచ్చినరోజు నుండీ అత్తగారి గుణం చూపిస్తూనే వుంది. అతను ఆవిడ పెద్దకొడుకు. అతనికి పెళ్ళి అంజని కాపురానికి వచ్చేసరికి అతని తమ్ముళ్ళు, ముద్దుల చెల్లెళ్ళు చదువుకుంటున్నారు. వీళ్ళుగాక ఇంట్లో మేనత్త ఆమె సత్తికొడుకూ కూడా వుండేవారు. ఇంతమందితో సర్దుకుపోవడానికి అంజనికి చాలా ఓరిమి కావల్సివచ్చింది.

ఇందీవరాక్షి కాఫీ కలుపుకుని వచ్చి ముసలావిడకొక గ్లాసు, మామగారికొక గ్లాసు అందించింది.

''చిన్నపిల్లవు...కొత్తగా పెళ్ళయి వచ్చినదానివి... అన్ని పనులూ నీమీద వేసేసి మీ అత్త ఆ చంటిదాన్ని అడ్డం పెట్టుకుని కూచుందా? బావుందమ్మా...'' సాగదీసింది ముసలామె.

హరిహరరావుకి నవ్వొచ్చింది.

ఈ మాటలు చెవినబడిన అంజని పిల్లని కూతురి కందించి గుమ్మంలోకి వచ్చింది.

''చింత చచ్చినా పులుపు చావలేదని వయసు ఉడిగినా అత్తగారి పెత్తనం సాగిస్తూనే వున్నారుగానీ కొత్తకోడలికి నామీద విషం నూరిపొయ్యకండి'' అంది విసురుగా.

''చూశావురా? నేనేమన్నానని నామీద అలా ఒంటి

## చూసే ఆ చూపులోనే ఉంది

కనుకు తీస్తే
కళ్ళనిండా కారుచీకటి పొగలు.
కనురెప్పల కిటికీలు తెరిస్తే
చీకట్లమాటున నిట్టూర్చే వెలుతురు నవ్వులు.
ఈ దృశ్య వైవిధ్యమంతా
చూసే ఆ చూపులోనే వుంది.
ఎడారిలో దారి తప్పిపోయిన
వాయునాదాలు
ఏ వేణువుల కోసం ఎదురు చూస్తుంటాయో.
ఎండుమట్టి అట్టడుగు పొరల్లో
గుప్తంగా పడివున్న నీటి నిధులు
ఏ దోసిళ్ల కోసం కలవరిస్తుంటాయో-
తెలుసుకునే మనసుంటే అది ఎంతగా
పరవశిస్తుందని.
నేలలో వేళ్లూనిన చెట్లు ఎదుగుతుంటాయి.
తమ కొమ్మల చేతులతో
గగనాన్ని ఒడిలోకి తీసుకోవాలని.
తేలిపోయే మబ్బులు ఉబలాట పడుతుంటాయి
తమ జలాంగుళులతో
సృష్టిలోని ప్రతి అంగాన్ని స్పృశిస్తూపోవాలని.
అనుభూతికి మాత్రమే అవగతమయ్యే
ప్రకృతిగత రహస్య సూక్ష్మాలివి.
హేమంతం ఎదురుచూస్తూ వుంటుంది
గ్రీష్మ స్పర్శతో
తన తనువు వెచ్చగిల్లిపోవాలని.
శిశిరానికి ఒకే తపన
వసంతం రాకతో
తాను నిశ్చింతగా నిష్క్రమించాలని.
అది అగోచరమైనా సుగోచరమైనా
ఏదీ అనిర్వచనీయం కాదు.
సునిశితమైన చూపుంటే
పరమభౌతిక దృశ్యాల్లో
మానవీయాంశాలు అడుగడుగునా గోచరిస్తాయి.

-డా. సి.నారాయణరెడ్డి

## కొత్త భయం

ఉదయం నుంచీ
పదిసార్లు కాల్ చేశాను
రింగవుతోంది, కాని
రెస్పాన్సు లేదు
నిర్లక్ష్యాన్ని క్షమించలేను
నిశ్శబ్దాన్ని భరించలేను
పిలిచినపుడు, పలక్కపోతే
అస్సలు సహించలేను
కోపం వచ్చినపుడు
సవాలక్ష సందేహాలు
'సెల్లు' స్విచ్ఛాఫ్ చేస్తే
తిట్టుకోవచ్చు
రింగుటోన్ వినబడ్తుంటే-
ఎన్నెన్నో అనుమానాలు
'సెల్' చెడిపోయి
తెలియడంలేదా!
నా నెంబర్ చూసి
తీయడం లేదా!
మనిషికి
జరక్కూడనిది-
ఏదైనా జరిగిందా!
మవునాన్ని,
ఆనందించలేను
అనుమానాన్ని,
తట్టుకోలేను
ఉదయం నుంచీ
కాల్ చేస్తున్నాను
ఇప్పుడయినా
పలుకుతే బాగుండు!

- ఆశారాజు

కాలిమీద లేస్తోంది?'' ముసలావిడ గొంతులోకి అప్పుడే ఏడుపు ఛాయలు వచ్చాయి.

''అబ్బా అమ్మా! నువ్వూరుకో... అంజనీ నువ్వెళ్ళి పనిచూసుకో...'' అన్నాడు హరిహరరావు విసుగ్గా.

అంజని కాపురానికి వచ్చిన నాటినుండి అమ్మ అధికారం ఛలాయించడం చూస్తూనే వున్నాడాయన.

''ఇంట్లో మరుదులు, ఆడబడుచులు వున్నారని గుర్తుంచుకుని మసలుకో... నలుగురి ముందు మొగుడితో సరదాలు, రాసుకు పూసుకు తిరగడాలు ఇక్కడ కుదరవు'' అంటూ అంజని అత్తింట అడుగుపెట్టిన రోజే ఆంక్షలు విధించింది అతని తల్లి.

రాత్రి పదిదాటితే గానీ అతనికి భార్యతో ఏకాంతం దొరికేది కాదు. తమ్ముళ్ళు చదువులు, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు అయ్యేసరికి ఆ దంపతులు ముగ్గురు పిల్లల తలిదండ్రులై కాడెద్దుల్లా బరువును మోసే జంటగా మిగిలారు.

ఇంటి ముందు ఆటో వచ్చి ఆగింది. వెనకాలే స్కూటర్లో విశ్వామిత్ర వచ్చాడు. పెద్ద సూట్‌కేసు, రెండు బ్యాగులతో ఆటో దిగింది మీనాక్షి.

నవ్వు ముఖంతో ఎదురొచ్చి వదినగారి చేతిలోని సామాను అందుకుంది ఇందీవరాక్షి.

''ఇందూ ఈ సామానంతా మీ గదిలో పెట్టించు... బాలింతరాలి గదిలో వద్దు'' అంది అంజని.

అలాగే నన్నట్టు తలవూపి లోపలికి నడిచింది ఇందీవరాక్షి బ్యాగు మోసుకుంటూ. అక్క సూట్‌కేసు పట్టుకుని తనూ ఆమె వెంటనే లోపలికి వెళ్ళాడు విశ్వామిత్ర.

''సారీ! ఇందూ! ఇవాళ సినిమా ప్రోగ్రామ్ చెట్టెక్కినట్టే...'' భార్య భుజంమీద చేయివేసి అన్నాడు విశ్వామిత్ర.

''అవతల అందరూ వున్నారు'' అంటూ ఆ చెయ్యి పక్కకు తోసేసి బయటకు వచ్చింది ఆమె.

అప్పుడే లోపలికి వచ్చిన హరిహరరావుకి విశ్వామిత్ర మాటలు స్పష్టంగానే వినబడ్డాయి.

''ఇదిగో ఇందూ! నువ్వు వాడితో కబుర్లు చెప్తూ కూర్చుంటే పనులు కావు. మీ వదినకు కాస్త కాఫీ ఇచ్చి ఆ చపాతీల పని చూడు'' అంటూ కోడలికి సూచనలిచ్చింది.

విశ్వామిత్ర భార్యవైపు ఒకసారి చూసి ముందు గదిలోకి వచ్చి నిస్పృహగా కూలబడ్డాడు.

''అంజని అచ్చం తన అత్తగారిలాగానే కోడలిమీద పెత్తనం చేస్తోంది... ఇది పరంపరగా సాగుతూనే వుంటుందేమో...'' నిశబ్దంగా కూర్చున్న కొడుకువైపు

చూస్తూ అనుకున్నాడు హరిహరరావు.

''అమ్మా ఇందూ! అందరికీ అన్నీ అందించి మీ ఆయన్ని మరచిపోకు. వాడికేం కావాలో చూడు'' మీనాక్షికి కాఫీ అందిస్తున్న కోడలితో అన్నాడాయన.

''మీరు ముఖం కడుక్కుని రండి...'' అంటూ విశ్వామిత్రకు తువ్వాలు అందించి వెళ్ళింది ఇందు. క్షణకాలం ఆమె చూపులు విశ్వామిత్ర బల్లమీదపెట్టిన పువ్వుల పొట్లంమీద నిలిచాయి. అతనుకూడా 'తీసుకో... నీకోసమే' అన్నట్టు చూశాడు. అంతలో అంజని లోపలి నుండి పిలవడంతో వెళ్ళిపోయింది ఇందు.

ఇంతలో మీనాక్షి పిల్లలిద్దరు అరుచుకుంటూ లోపలికి వచ్చారు ''అమ్మ వచ్చింది'' అంటూ.

మీనాక్షి వాళ్ళు వుండేది చిన్న ఊరు కావడాన పిల్లలను మంచి స్కూల్లో చదివించాలని ఈ ఏడాది ఇద్దర్నీ మాంటిస్సోరి స్కూల్లో చేర్పించి అమ్మ దగ్గరే పెట్టింది మీనాక్షి. కర్నూలుకు ప్యాపిలి ఎంత దూరం గనుక! ఏడేళ్ళ శర్వాణి బల్లమీది పువ్వుల పొట్లం చూసి ''అమ్మా నాకు పెట్టవే'' అంటూ విప్పింది.

''ముందు కాళ్ళు కడుక్కుని వెళ్ళి అత్త చపాతీలు ఇస్తుంది తినిరా... తలదువ్వుకుని పెట్టుకుందువు'' అంది మీనాక్షి. కామాక్షి గదిలోంచి చంటిపిల్ల ఏడుపు వినిపిస్తోంది.

హరిహరరావు కొడుకు ముఖంలోకి చూశాడు. అతడు మౌనంగా కూర్చుని పేపరు చూస్తున్నాడు.

బాలసారె ఘనంగా జరిగింది. రెండుగదుల ఆ ఇంట్లో మగవాళ్ళంతా హాలు, వసారాల్లోనూ ఆడవాళ్ళు గదుల్లోనూ సర్దుకున్నారు.

హడావుడి అంతా అయ్యాక హరిహరరావు ఇందీవరాక్షితో ఆ ఊళ్ళోనే వున్న జూనియర్ కాలేజీలో లెక్చరరు ఉద్యోగానికి అప్లికేషను పెట్టించాడు.

పెళ్ళికి ముందు ఆ అమ్మాయి అనంతపురంలో ఒక ప్రైవేటు కాలేజీలో పనిచేసేది. పెళ్ళికాగానే ఉద్యోగం రిజైన్ చేసి వచ్చేసింది.

''ఇప్పుడు అమ్మాయి ఉద్యోగం చేయకపోతే జరగదా?'' అంటూ అడ్డుపడింది అంజని.

''నేను చూస్తే రిటైరయ్యాను. నా పెన్షన్ ఏమీ పెరగదు. సంసారంలో ఖర్చులు పెరుగుతున్నాయి కదా! వాడి జీతం ఒక్కటే ఏం చాల్తుంది?'' అన్నాడు హరిహరరావు.

విశ్వామిత్ర మనసు చివుక్కుమంది. 'అంటే తన భార్య రావడంవలన ఖర్చులు పెరిగాయనుకుంటున్నాడా తండ్రి?' అనిపించి.

పదిహేనురోజుల్లో ఇందీవరాక్షిని ఇంటర్వ్యూకి పిలిచారు. మరుచటిరోజే పక్కనే వున్న ఆదోనిలో వున్న తమ సంస్థ బ్రాంచ్‌కి జూనియర్ లెక్చరరుగా వేస్తున్నట్టు ఆర్డరు పంపించారు.

''అబ్బాయి ఇక్కడ వుంటే అది ఎక్కడో ఉద్యోగం చేయడమేమిటి? అర్థంలేకండా... ఏం వద్దు'' అంది అంజని.

''వచ్చిన అవకాశం వదలుకుంటే మళ్ళీ బాధపడాల్సి వస్తుంది. వాడి ఆఫీసు ఆదోనిలోను వుంది. ట్రాన్స్‌ఫర్ పెట్టుకుంటే సరి'' అన్నాడు హరిహరరావు.

## కరువొచ్చింది!

ప్రాగే నీటికే కాదు బ్రతికేందుకు నీతికీ!
విద్యుత్‌కే కాదు జగతిలో ధర్మానికీ!
తినే తిండికే కాదు సామాజిక న్యాయానికీ!
మనుగ సాగించడానికే కాదు భువిపై
భూతదయకూ!
పాలిచ్చేందుకు కన్నతల్లికే కాదు
పాలించేందుకు ప్రభువులకూ!
పుణ్యాన్ని ఆర్జించేందుకే కాదు
ప్రజల పాపాలు మోసేందుకు భూమాతకూ!
అహింసను ఆచరించేందుకే కాదు
హింసను రూపు మాపేందుకూ!
భక్తిని ఆహ్వానించేందుకే కాదు
మూఢభక్తిని నివారించేందుకూ!
సమత మమతల్ని పంచేందుకే కాదు
కులమత తత్వాల్ని నివారించేందుకూ!
మానవత్వాన్ని నిలిపేందుకే కాదు
దానవత్వాన్ని రూపుమాపేందుకూ!
క్షుద్బాధను తీర్చేందుకే కాదు
కలి బాధను నివారించేందుకూ!
వెరసి గుత్తంగా మొత్తంగా కలికాలానికే!
ఈ విపత్కరస్థితి ఇలా వచ్చింది
అందుకే కరువొచ్చింది!
ఇమ్మహికే కరువొచ్చింది!

*- దోసపాటి సత్యనారాయణ మూర్తి*

# గుండె పుటల నిండా...

చీకటి కోణాల్లో బందీలైన బతుకులికి
జాగృతీ లేదు... నిష్కృతీ లేదు
సంసారం అగ్నిగుండం మీద నడక
గుండె పుటల నిండా అవమానాల చరిత్ర
మనసులో అలజడిని తొలగించుకోవాలనే ఆశలు
చేదు అనుభవాల నించి
ఎటూ తప్పించుకోలేని తవం
అవమానాలతో బతుకు మండిపోతున్నా
తియ్యటి పలకరింపుకోసం
యుగ యుగాల నిరీక్షణ
అశాంతి నుంచి బైటపడాలి
ఒక నూతనతత్వ మేదో రావాలి
తూర్పు పడమరలు కలవనక్కర్లేదు
మనిషి ఎదుటి మనిషిని కలవాలి
బతకలేకపోవడం
బానిసగా మిగిలిపోవడం
చరిత్ర నుంచి తుడిచిపెట్టుకుపోవాలి
ఏదో ఒకరోజు గుండెపుటలు
సున్నితంగా తెరబడతాయి
నిస్సహాయతను ప్రతిఫలింపజేస్తాయి
అప్పుడు ప్రపంచానికి ఊపిరాడదు
దారితప్పిన వాడికి దారి తెలియదు
రేటు నిర్ణయించిన వాడికి నేల దొరకదు
మృగాల్లా సంచరిస్తున్న ముళ్ళు వున్నా
దానిమీదపడే వస్త్రమే వుండదు
కంపకీ వస్త్రానికీ వైరం
వస్త్రం ఇప్పుడు తెలివిని నేర్చింది
వెర్రితలలు ఎగరేస్తున్న సాంప్రదాయాల్ని
అది నిలువునా కప్పేసింది
ఇప్పుడు చావులూ లేవు బతుకులూ లేవు
అంతా భతకనేర్చిన తనం తప్పించి...

- దోర్నాదుల సుబ్బమ్మ

''వద్దులెండి మావయ్యా. మేమొకచోట మీరొకచోట ఎందుకు?'' అంది ఇందీవరాక్షి.

''నెలకు ఎనిమిదివేలు వస్తుంటే చేదా అమ్మా... ఏం ఫరవాలేదు... వాడి ట్రాన్స్‌ఫర్ సంగతి నేను చూస్తాను'' అన్నాడు హరిహరరావు.

'కోడలు ఉద్యోగం చేసి సంపాదిస్తుందన్న ఆశతోనే నాన్న కట్నం తక్కువైనా ఈ సంబంధానికి ఒప్పుకున్నా డులా వుంది' అనుకుంటూ విశ్వామిత్ర మౌనం వహించాడు.

అనుకున్నట్టుగానే విశ్వామిత్రకు పదిహేను రోజుల్లో ఆదోనికి ట్రాన్స్‌ఫరయింది. ఇందీవరాక్షి పనిచేయాల్సిన కాలేజీకి దగ్గర్లో ఇల్లు చూసి వచ్చాడు హరిహరరావు.

వాళ్ళు బయల్దేరే రోజున ఇందీవరాక్షి, అంజని లోపల వున్నప్పుడు కొడుకుతో అన్నాడు హరిహరరావు- ''ఆ కాలేజీవాళ్ళు ఈ ఊళ్ళోని వాళ్ళకు ఇక్కడ పోస్టింగు ఇవ్వరని నాకు తెలిసే అప్లై చేయించాను. ఆదోనికి వేయమని అడిగిందీ నేనే. పెళ్ళైన కొత్తల్లో వుండే సరదాలు మళ్ళీ రావు. నాలాగే నువ్వు కూడా కుటుంబ బాధ్యతలు మోస్తూనీ ఆనందానికి దూరం కాకూడదనే ఈ ఏర్పాటు. హాయిగా ఇద్దరూ చిలకా గోరింకల్లా రెండు మూడేళ్ళు గడపండి. డబ్బు సంపాదించగలం గానీ కాలాన్ని వెనక్కి తీసుకురాలేము. నెమ్మదిగా మళ్ళీ ఈ ఊరికి వచ్చే ప్రయత్నం చేయవచ్చును. మీరు దూరంగా వుండడం నాకూ బాధే. కానీ మీరిద్దరూ కొంత కాలమైనా బాదరబందీ లేకండా సంతోషంగా వుండాలనే నా ఉద్దేశం'' అని.

తండ్రి గురించి పొరబాటుగా ఊహించిన దానికి సిగ్గు పడ్డాడు విశ్వామిత్ర. తండ్రి మనసు తెలుసుకున్న విశ్వామిత్రకు మనసంతా సంతోషంతో నిండిపోయింది. అతని ముఖంలోకి కొత్త కాంతి వచ్చింది. అప్పుడే బయటకు వచ్చిన ఇందీవరాక్షితో కలిసి తండ్రి పాదాలకు నమస్కరించాడు.

''పిల్లలిద్దరికీ స్కూలు జరుగుతున్నది. లేకుంటే నేనూ మీతో వచ్చి కొత్తకాపురంకు కావల్సినవి సర్ది ఇచ్చేదాన్ని'' అన్నది అంజని తనకు దండం పెడుతున్న కొడుకుతో, కోడలితో.

హరిహరరావు కొడుకువైపు చూసి అర్థవంతంగా చిరునవ్వు నవ్వాడు. తండ్రి మనసు తెలిసిన విశ్వామిత్ర కూడా చిరునవ్వు నవ్వి ''ఫరవాలేదు లేమ్మా... సెలవులొచ్చినప్పుడు వాళ్ళనీ తీసుకుని వద్దువులే...'' అనేసి ఇందీవరాక్షితో బయల్దేరాడు. ■